# 'అమ్మ బొమ్మద్ది'

జె. మాలతి

అన్నం తినబోతూంటే గేటు తీసుకుని పోస్ట్ మాన్ రావటం కనిపించింది.

'అన్నంలో పప్పు కలపండి... నెయ్యి వేస్తాను' అంది రాజేశ్వరి. చటుక్కున లేచి చెయ్యి కడుక్కుని టవల్‌తో తడుచుకుంటూ గుమ్మం లోకి వచ్చాను.

'విశ్వనాథం అంటే మీరేనా?'

తల ఆడించాను.

'మీకు మనియార్డర్ ఉంది. ఇంటూ మార్కు లున్న చోట సంతకాలు చెయ్యండి' అంటూ మనియార్డర్ ఫారమ్ ఇచ్చి డబ్బులు తీస్తున్నాడు పోస్ట్‌మాన్.

విశ్వనాథం మూతి మూరెడు పొడుగు చేసు కుని నవ్వుకుంటూ సంతకాలు చేశాడు.

'కథలు రాస్తారాండీ మీరు?' అడుగుతూ డబ్బు అందించాడు పోస్ట్‌మాన్. 'వినతి' పత్రిక నుంచి తరచూ మనియార్డర్ తీసుకుంటున్నారు కదా. అందుకని...' తిరిగి అతనే అన్నాడు.

'ఔను' మీరు చదువుతుంటారా?'

'ఎక్కడండీ... తిరిగి తిరిగి ఈ ఉత్తరాలూ, మనియార్డర్‌లూ బట్వాడా చేసేసరికి కాళ్లు నొప్పులైపోయి ఇక ఏం చదవలేను. పత్రికల పేర్లవీ మాత్రం తెలుసు' అంటూ నమస్కారం చేసి వెళ్లిపోయాడు పోస్ట్‌మాన్.

మనియార్డర్ డబ్బు ఆరొందలూ రాజేశ్వరికి ఇచ్చి మళ్లీ అన్నం ముందు కూర్చున్నాడు విశ్వనాథం.

'ఎంత... ఆరొందలా?' అంటూ మళ్లీ లెక్క చూసింది రాజేశ్వరి.

'ఔను, ఆ మధ్య వరసగా 'పిల్లల కథలూ –పిట్ట కథలూ' అంటూ 'వినతి' పత్రికలో ఆరు వారాలు వేసారు కదా... ఆ డబ్బు పంపించారు' అన్నాడు పులుసులోని ములక్కాడలు నము లుతూ.

'ఆరు వారాలు వేసుకుని ముష్టి ఆరొందలి చ్చారా?' అంటూ మూతి విరిచింది రాజేశ్వరి.

'ఆరొందలు... చీర కొనుక్కో...'

'ఆరొందలు... ఆరువేలు అన్నట్టు మాట్లాడ తారే' అంటూనే ఆ డబ్బు తీసుకెళ్లి దాచుకుంది రాజేశ్వరి.

ఆ సాయంకాలం రాజేశ్వరి తమ్ముడు వేణు అక్కాబావల్ని చూడటానికి వాళ్లింటికి వచ్చాడు.

'ఒరేయ్ వేణూ మీ బావగారి రచనలు పత్రికల్లో పడుతున్నాయిరా. ఇవాళే ఆరొందలు

మనియార్డర్ వచ్చింది, తెలుసా?' అంది రాజే శ్వరి వేణుకి కాఫీ ఇస్తూ ఆమె ముఖం మతా బులా వెలిగిపోతోంది.

'నిజంగానా, బావగారూ? మరి ఇన్నాళ్లూ మీరు రాస్తున్నట్టు చెప్పలేదేం? చెప్తే మేమూ సంతోషిస్తాంగా... ఇంతకీ ఏ పత్రికలో రాస్తు న్నారేం?' అడిగాడు వేణు.

'ఆ... అంత ఏం రాసిపడిపోలేదులే. వుత్తినే కూచుంటున్నానుగా రిటైరయ్యి... అని పిల్లల కథలు రాసాను.'

'అయ్యో, పిల్లల కథలా? మీ ప్రిస్టేజికి భంగం. మంచి మంచి పెద్ద కథలూ, నవలలూ రాయండి. పేరుకి పేరూ, డబ్బుకి డబ్బూ. ఫలా నా సీరియల్ వారం వారం వస్తోంది, మా బావగారు విశ్వనాథంగారు రాసారు అని చెప్పు కోవటానికి మాకెంతో గర్వంగా వుంటుంది. పెద్దపెద్ద కథలైనా రాయండి. ఇంతకీ ఏ పత్రిక లో వేసారో చెప్పేరు కాదు.'

"వినతి' పత్రికటరా. రోజూ మధ్య రాత్రి లేచి కాయితాలూ, పెన్నూ తీసుకుని బరుకు తూంటే ఏమిటో అనుకున్నా. రాస్తున్నట్టు నాకే తెలియదు.'

'ఆ పత్రిక పేరెక్కడా విన్నట్టు లేదే...'

'నువ్వేం వింటావులే. నీకూ, మీ అక్కకీ సాహిత్యపు వాసన అసలు పడదు. ఇక ఆ విషయం వదిలెయ్. ఏదో ఊసుపోక నేనట్లా రాస్తుంటాను. పెద్ద స్కేలున్న నవలలూ, సీరి యల్సూ రాయటానికి నేనేం యండమూరినా, మల్లాదినా?'

'కోపం వద్దు బావగారూ. నేనూ, మా అక్కా ఎలాగూ పుస్తకాలు చూడంగాని, మీరు రాస్తున్నా రంటే మేం చదవనూ చదువుతాం – మా చుట్టు పక్కల వాళ్లందరి చేతా బలవంతంగా కూడా చదివించి తీరతాం. వేణా మజాకా... వేణు అంటే ఏమిటనుకున్నారు... మీకయితే బావ మరిదిని కాని, బైట మన లెవెల్ ఎక్కువే...!

'నువ్వూ, మీ అక్కా చాలా గొప్ప వాళ్లేలే వోయ్. అలా ఒప్పుకోకపోతే నాకు ఫుడ్ దొర కదు.'

'సారీ అండీ బావగారూ, నేను మిమ్మల్ని ఏమైనా హర్ట్‌చేస్తే... కానీ ఒకటి చెపుతున్నా. మీకు రాసే టాలెంట్ ఎంత లేకపోతే మీరు రాసినవి వరుసగా ఆరు వారాలు... సిక్స్‌వీక్స్... వేసుకుంటారు? నేననేదేమంటే ఇక మీరు పిల్లల కథలు, పిల్లి కథలూ మానేసి కథలు రాసి మరిం త లైమ్‌లైట్‌లోకి రండి. పేరు ప్రఖ్యాతులు వస్తాయి, డబ్బు కూడా ఎక్కువొస్తుంది.'

'విన్నారా మా తమ్ముడు చెప్పింది. మీరు టాలెంట్ వుండీ అలా జావకారి పోతారేం?'

'సరే బావగారూ, ఏదో పనిమీద ఇటుగా వెళ్తూ మిమ్మల్ని ఇద్దర్నీ చూచి పోదామని వచ్చాను. మళ్లీ రాత్రి వస్తాను. వచ్చినప్పుడు మంచి పత్రికలు రెండు మూడు తెస్తాను. వాటికి రాసి ఓవర్ నైట్ షెద్దరచయిత అయిపోండి.' అంటూ బైకెక్కి తుర్రుమన్నాడు వేణు.


ఆ రాత్రి రాజేశ్వరి, విశ్వనాథం భోజనం చేసి టి.వి. చూస్తూండగా మళ్లీ వచ్చాడు వేణు... భుజానికో బ్యాగ్ తగిలించుకుని.

'బావగారూ, బావగారూ! చూశారా మీ కోసం మంచి మంచి పత్రికలు ఎన్ని తెచ్చానో... వీటి అడ్రస్‌లు నోట్ చేసుకుని ఏ పత్రికలో ఏటైపు కథలు వేస్తున్నారో చదివి తెలుసుకుని, వాటికి కథలు రాయండి.' అంటూ కట్ట పుస్త కాలు అక్కడ పడేసాడు.

వేణుకి పుస్తకాలు చదవడం, కొనడం రెండూ అలవాటులేదు. అట్లాంటిది ఇప్పుడిన్ని పత్రికలు తెచ్చాడంటే తన కోసమేగా!

డ్యామ్ ప్లీజ్ అయిపోయాడు విశ్వనాథం.

'భోంచేసేవురా, రాత్రి పదవుతోంది.' బావ




గారికి ఇంత సేవచేస్తున్నాడు తమ్ముడనే ఆనందంలో రాజేశ్వరి వేణు భుజమ్మీద చెయ్యివేసి లాలనగా అంది. 'ఇంకా లేదక్కా కానీ ఇంటి దగ్గర లావణ్య తను భోంచేయకుండా నా కోసం చూస్తుంది కదా, అందుకని ఇక వెళ్తాను. బావగారూ, కొత్త పత్రికలకి రాయండే... వస్తాను. బై' అంటూ కనుమరుగయ్యాడు వేణు.

* * *

'బావగారూ, పత్రికలన్నీ చూసారా? ఏమైనా కథ రాయటం ప్రారంభించారా?' అన్నాడు ఆ మర్నాడు.

'ఆ... ఆ... నువ్విచ్చిన పత్రికలన్నీ చూసానోయ్. అందులో 'శాంతి' 'ఆంధ్రరాణి' పత్రికలు రెండూ చాలా బాగున్నాయి. ఆ రెండు పత్రికల్లో కథల పోటీలు కూడా ప్రకటించారు.

వాటికి...'

'అద్గదీ... చురుకుదనమంటే అలా వుండాలి. కథలపోటీకి రాస్తే పత్రికల వాళ్లు తప్పకుండా చూస్తారు. ప్రైజ్ కూడా రావచ్చు.

'దాన్లో కథకి ఫస్టుప్రైజ్ అయిదువేలు, సెకండ్ ప్రైజ్ మూడు వేలూను...'

'మరి ఇకనేం... వెంటనే కథకు శ్రీకారం చుట్టండి, మీరు రాసి కాపీచేసి నాకివ్వండి. నేనే పోస్టుచేస్తాను. ఆ రెస్పాన్సబిలిటీ నాది.'

'ఇదిగోనోయ్. ఇప్పుడే మొదలెడుతున్నాను. పోటీ గడువుతేదీ ఆరురోజులే వుంది. నేను కాపీ చేసి నీకు రేపిస్తాను. ఆర్.ఎమ్.ఎస్. లో సాయంకాలం పోస్ట్ చెయ్యి.'

పడీ పడీ కథరాసి కాపీ చేశాడు విశ్వనాథం.

ఆ పని అయిపోగానే 'ఆంధ్రరాణి' పత్రిక చూసాడు. అక్కడా ఉగాది కథల పోటీకి గడువు తేదీ అదే వుంది. 'సరి, ఇక ఆలస్యం ఎందుకు?' అనుకుని దానికి కూడా ఇంకో కథ రాసి, అదీ కాపీ చేసాడు.

రెండూ ఒకే రోజులో రాసి, కాపీ చెయ్యటం వల్ల నడుం పట్టేసింది. అయినా పట్టువిడువక కవర్ల కోసం వెదికాడు. ఎట్లాగో అయిదు కవర్లు దొరికాయి. అందులో నాలుగు తీసి రెండు పత్రికలకీ రెండు కథల కాపీస్ లోపలపెట్టి, ప్రచురించని పక్షంలో రిటర్న్ చేయడానికి వీలుగా ఇంకో రెండు కవర్లకి తన అడ్రస్‌రాసి వేణు వస్తే ఇవ్వటానికి రెడీ చేసాడు.

ఆ వయసులో ఇన్ని పనులు చేసేసరికి బి.పి. రైజయినట్లు అనిపించింది.

'ఏయ్ రాజీ, ఫ్రిజ్‌లో చల్లటినీళ్లూ, అయిస్ క్రీమ్ తెచ్చి ఇవ్వవే. బి.పి. పెరిగినట్లుంది. రాజీ, ఏయ్ రాజీ...'

'ఇప్పుడేగా పిలిచారు... ఈ లోపల ఇల్లు పీకి పందిరి...'

'మాటకిమాట అప్పజెప్పే లక్షణం పోదు – నా మందుల పెట్టె పట్రా. బి.పి. పెరిగినట్టుంది. విను ముందూ...'

చెప్పినట్టుగానే సాయంకాలం ఏడున్నరకి వేణు వచ్చాడు.

'ఏం బావగారూ, కథలు రెడీయేనా?'

'రెడీయే లేరా. పాపం రాసి రాసి బి.పి. పెరిగినట్టుంది. స్లీపింగ్ పిల్ వేసుకు పడుకున్నారు. రెండు కవర్లూ ఇవిగో స్టాంపులన్నీ సరిగా అంటించి వెయ్యమన్నారు.'

కథలు పోస్టుఅయ్యాయి. పోటీగడువుతేదీ దాటిపోయింది.

ఏమేం బహుమతులు వస్తాయోనని మురిసిపోతున్నారు వాళ్లిద్దరూ.

రెండు పోటీల్లో బహుమతులు వస్తే ఉంగరమొకటి, దుద్దులజత ఒకటీకొని రాజేశ్వరికి ప్రెజెంట్ చేస్తానని ప్రమాణం చేసాడు.

ఆ రోజు రాజేశ్వరి పనిమనిషి చేత బూజులు దులిపిస్తోంది.

'ఎక్కడ బడితే అక్కడే కాయితాలూ, కవర్లూ. ఇవన్నీ అయ్యగారికి ఇయ్యవే.' అని కాగితాలు విశ్వనాథానికి ఇప్పించింది. ఆ కాగితాలు చూసుకున్న విశ్వనాథం బావురుమన్నాడు.


'ఏమయింది, ఏమయింది' అంటూ రాజేశ్వరి వచ్చింది.

'ఒకే కథ రఫ్ కాపీ, ఫెయిర్ కాపీ – రెండు కాపీలూ రెండు పత్రికలకీ పంపించానే.'

'అయితే రెండింట్లోనూ ప్రైజ్‌లు వస్తాయిగా.'

'నీ మొహం... వేణుని రమ్మని ఫోన్ చెయ్యి'

* * *




'ఏం బావగారూ, ఏమయింది, ముందు ఆరామ్‌గా కూచోండి. నాకేం అర్థమవలా అక్క ఫోన్లో చెప్పింది...' అడిగాడు వేణూ వస్తూనే.

'అదికాదురా వేణూ. రెండు పత్రికలకీ రెండు కథలూ రాసి ఫెయిర్ కాపీస్ కూడా రాశాను. అయితే కవర్లో పెట్టినప్పుడు ఒకే కథ కాపీలే రెండు పత్రికలకీ పంపించాను. ఇప్పుడు ఎవరు కథ వేస్తారో, ఎవరు వెయ్యరో ఇద్దరూ ఒక పత్రికకి తెలీకుండా ఒకరు వేస్తే నా పేరు బ్లాక్ లిస్ట్‌లోకి వెళ్ళిపోతుందేమోనని భయంగా వుంది.'

'ఏం భయంలేదులే బావగారూ. ఏ పత్రిక లో ముందుపడితే. ఇంకో పత్రిక వాళ్ళకి 'సారీ' అంటూ మనం చేసిన పొరబాటు చెప్పేద్దాం - అంటే ఫోన్లోనో లెటర్ ద్వారానో.'

'ఏమో నాకు మాత్రం చాలా ఆదుర్దాగా వుందోయ్.'

'సరే నాకు అంతకన్నా అర్జెంట్ పన్లు న్నాయ్. వెళ్ళొస్తా... బావగారూ.'

'ఎట్లా పొడు చేసుకున్నానో. ఇక ఏ పోటీ లోనూ నాకథని ఎంటర్‌టైన్ చెయ్యరు.' అని గొణుక్కుంటూ రాత్రంతా పక్కమీద అశాంతిగా దొర్లాడు విశ్వనాథం.

మర్నాడు పొద్దున్న విశ్వనాథం వాకింగ్ నుంచి వచ్చేసరికి 'ఫోన్ చేసాడు వేణు. మీ కథలు రెండూ వాడసలు పంపనేలేదట. ఆ రోజు మీ కథలు పట్టుకుని స్టేషన్‌కి వెళ్తాంటే దోవలో వాడి ఫ్రెండ్ కనబడి వాళ్ళ ఆఫీసరు కొడుక్కి సీరియస్‌గా వుందంటే హాస్పిటల్‌కి వెళ్ళా డట. ఆ తర్వాత రెండు రోజులూ ఆ పనిమీదే తిరుగుతూ మీ కథల సంగతే మరచిపోయా డట. జ్ఞాపకం వచ్చి మూడోరోజు చూసేసరికి పోటీ గడువు తేదీ దాటిపోయిందట.'

బావగారికి ఏ మొహం పెట్టుకు చెప్తానని చెప్పలేదట. 'బావగారిని ఏమనుకోవద్దని చెప్ప క్కా' అని చాలా బతిమాలాడు పాపం.'

'అమ్మ బామ్మర్దీ!!' అనుకున్నాడు విశ్వ నాథం. ●